

అయోధ్య రామమందిరం నమూనాలో తయారైన కారు

రామమందిరం ఆకారంలో కారు

● పాతబస్తీకి చెందిన సుధాకర్ సృష్టి

మదీన, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : అయోధ్య రామమందిరంలో విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ నేపథ్యంలో బహదూర్‌పురా సుధాకార్స్ మ్యూజియంలో రామ మందిరం నమూనాలో కారును రూపొందించారు. వినూత్న కార్ల రూపకర్త సుధాకర్ పాతబడిన మెటాడోర్ వాహనం రూపురేఖలు మార్చి కదిలే రామమందిరాన్ని తయారుచేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ మందిరాన్ని పోలి ఉండే వాహనం 22 ఫీట్ల పొడవు, 26 ఫీట్ల ఎత్తులో ఉంటుందని. రెండు రోజుల్లో పనులు పూర్తయి సందర్శకులకు అందుబాటులోకి వస్తుందని, డ్రైవర్ మాత్రమే కూర్చునేలా తయారుచేశామని, గంటకు 60కి.మీ వేగంతో నడుస్తుందని చెప్పారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): టీఎస్ఎస్పీడీసీఎల్ ఆస్మాన్‌ఘడ్ డివిజన్ పరిధిలోని మరమ్మతు పనుల కారణంగా బుధవారం 11కేవీ ఐఎస్‌సదన్, దర్గా ఫీడర్ల పరిధిలోని పరిసర ప్రాంతాలలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, జీఎం నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, జమాల్ కాలనీ ఫీడర్ పరిధిలోని పరిసర ప్రాంతాలలో మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు జహంగీర్ నగర్ ఫీడర్ పరిధిలో సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ హన్మంత రెడ్డి తెలిపారు.

సరూర్‌నగర్ : బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని కుర్మల్‌గూడ గ్రీన్‌ఫీల్డ్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం (17న) సదరు ఫీడర్ పరిధిలోని కుర్మల్‌గూడ, జేఎన్ఎన్‌యూఆర్ఎం గృహ సముదాయం, ఇందిరానగర్, పరిసర ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తుర్కయంజాల్ ట్రాన్స్‌కో ఏఈఈ బొజ్జ శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా నాదర్‌గుల్ ఇండస్ట్రియల్ ఏరియా ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగింపు పనులు చేపట్టనున్న దృష్ట్యా సదరు ఫీడర్ పరిధిలో బుధవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

విలన్లకు మహా నేతల పేర్లా...!

అభ్యంతరం వ్యక్తం చేసిన ఏఐవైఎఫ్

హైదరాబాద్ సిటీ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు కారం సినిమాలో విలన్లకు కారల్ మార్క్స్, లెనిన్ పేర్లు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) అధ్యక్ష, కార్యదర్శులు వలి ఉల్లా ఖాద్రీ, కే.ధర్మేంద్రలు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. సినిమా దర్శకుడు త్రివిక్రమ్‌కు మతిభ్రమించిందని, శ్రామికవర్గ నేతల పేర్లు విలన్లకు పెట్టి సమాజానికి ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారని ప్రశ్నించారు. కారల్ మార్క్స్ ప్రపంచానికి కమ్యూనిజాన్ని పరిచయం చేసిన మహా మేధావి అని, దాస్ కేపిట్ రచించి శ్రామికవర్గ విముక్తికి జీవితం ధారపోశారని అన్నారు. మార్క్సిజంతో రష్యాలో విప్లవాన్ని విజయవంతం చేసిన ఘనత లెనిన్‌దని అన్నారు. అలాంటి మహా నేతల పేర్లు సినిమాలో విలన్లకు పెట్టడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నామని, ఇందుకు త్రివిక్రమ్, హీరో మహేష్‌బాబులు బహిరంగ క్షమాపణ చెప్పాలని, పేర్లను వెంటనే తొలగించేలా సెన్సార్ బోర్డు చర్యలు చేపట్టాలని వారు కోరారు.

డివైడర్‌పై పడి వ్యక్తి మృతి

హయత్‌నగర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు డివైడర్‌పై పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దఅంబర్‌పేట్‌లోని వినాయకనగర్ కాలనీలో శ్యామల వెంకట్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నాడు. వెంకట్‌రెడ్డి(43) కూలీ పని చేసుకుని జీవనం కొనసాగిస్తున్నాడు. సోమవారం పనిమీద హయత్‌నగర్‌కు వచ్చాడు. తిరిగి సాయంత్రం 6.30 గంటలకు బైకు మీద పెద్ద అంబర్‌పేట్ వైపునకు వెళ్తుండగా జాతీయ రహదారిపైన సంగం హోటల్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి అకస్మాత్తుగా అడ్డం వచ్చాడు. వెంకట్‌రెడ్డి సదురు వ్యక్తిని ఢీ కొట్టి రోడ్డు పక్కనే ఉన్న డివైడర్‌పై పడి తీవ్ర గాయాలకు గురి అయ్యాడు. వెంటనే స్థానికులు గమనించి హయత్‌నగర్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వెంకట్‌రెడ్డిని సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే వెంకట్‌రెడ్డి మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


కల్యాణోత్సవంలో ఆలయ కమిటీ ప్రతినిధులు

ఓల్డ్ మలక్‌పేటలో ఘనంగా గోదాదేవి కల్యాణం

మలక్‌పేట జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఓల్డ్‌మలక్‌పేట మున్సిపల్ కాలనీలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం గోదాదేవి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఉమారెడ్డి, ఈఓ శ్రీజోషి మార్తాండరావు సమక్షంలో కల్యాణం జరిగింది. కల్యాణంలో కాలనీవాసులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు శ్రీనివాసాచార్యులు, రామాచారి, కోమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, చౌకి రవికుమార్ మదన్‌రెడ్డి, చందు, భావన, రజిని, లావణ్య, ఉషాగోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవాలలో బోనాలతో ఊరేగింపు

వైభవంగా కరణ్‌బాగ్ మల్లన్న జాతర

సైదాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): భాగ్యనగరంలోనే ప్రసిద్ధిగాంచిన 400 సంవత్సరాల పురాతనమైన సైదాబాద్ కరణ్‌బాగ్‌లోని శ్రీమల్లికార్జున స్వామి దేవాలయం మల్లన్న స్వామి మూడు రోజుల జాతర వేడుకలు సోమవారం రాత్రి ఘనంగా ముగిశాయి. వేడుకలలో భాగంగా రేణుకా ఎల్లమ్మ, నల్లపోచమ్మ, మహంకాళి అమ్మవార్లకు బోనాలు, వడిబియ్యం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఉత్సవాలకు నగరంలోని పలు ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి వీఎస్‌వీ సత్యనారాయణ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ వేడుకలు ఒగ్గు పూజారి మారయ్య బృందం ఆధ్వర్యంలో నిర్వహించారు.


మీర్‌పేట్‌లో ముగ్గుకు రంగులద్దుతున్న చిన్నారి


బాలాపూర్‌లోని తన ఇంటి ముందు ముగ్గు వేస్తున్న బడంగ్‌పేట్ మేయర్ పారిజాతారెడ్డి


చంపాపేటలో ఇంటి ముందు చిన్నారితో కలిసి ముగ్గులు వేస్తున్న మహిళ


మాధవనగర్‌కాలనీలో మకర సంక్రాంతి సందర్భంగా పాలు పొంగిస్తున్న మహిళలు

ఉత్సాహంగా సంక్రాంతి

సంక్రాంతి, కనుమ వేడుకలను ఎల్బీనగర్, మలక్‌పేట, యాకుత్‌పురా, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం నియోజక వర్గాల పరిధిలో ప్రజలు ఉత్సాహంగా జరుపుకున్నారు. మహిళలు ఇళ్ల ముందు అందమైన రంగవల్లులతో తీర్చిదిద్దారు. చిన్నా, పెద్దలు గాలిపటాలు ఎగురవేసి సంబరాలు చేసుకున్నారు. సంతోష్‌నగర్ రోడ్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన శ్రీ గోదాదేవి కల్యాణంలో కర్మన్‌ఘాట్ శ్రీ హనుమాన్ దేవస్థానం చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, సుమిత్ర దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

- ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్ జోన్ బృందం, ఆంధ్రజ్యోతి


చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లో గాలిపటాలను ఎగురవేస్తున్న యువకులు


కుటుంబసభ్యులతో కలిసి గాలిపటాలు ఎగురవేస్తున్న నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్‌జీ


సైదాబాద్‌లో గాలిపటాలు ఎగురవేస్తున్న ఎమ్మెల్యే బలాల


శ్రీ గోదాదేవి కల్యాణంను పురస్కరించుకొని హనుమాన్ ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డిని సన్మానిస్తున్న పాలకమండలి సభ్యులు


అల్మాస్‌గూడలో కాంగ్రెస్ ఆరు గ్యారంటీలతో వేసిన ముగ్గు


కేంద్ర మాజీ మంత్రి, దివంగత ఎస్.జైపాల్‌రెడ్డి జయంతి సందర్భంగా ఆయన సమాధి వద్ద నివాళులర్పిస్తున్న మధుయాష్కీగౌడ్

- ఫొటో : ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్

కుండల తయారీ యూనిట్‌కు సహకరిస్తా

మాజీ మేయర్ రామ్మోహన్

కుషాయిగూడ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కుండల తయారీ యూనిట్ ఏర్పాటుకు తనవంతు సహకారం అందజేస్తానని గ్రేటర్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ అన్నారు. మంగళవారం కుషాయిగూడ, చర్లపల్లి ప్రాంతాలకు చెందిన కుమ్మరి సంఘం ప్రతినిధులు పలువురు మాజీ మేయర్‌తో పాటు స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవిలను కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా బొంతు రామ్మోహన్ మాట్లాడుతూ 2018లో తాను మేయర్‌గా ప్రాతినిధ్యం వహించిన ఈ డివిజన్‌లో కుండల తయారీ యూనిట్ కోసం టీఎస్ఐఐసీకి చెందిన ఐదువేల గజాల స్థలాన్ని కేటాయించిన విషయాన్ని గుర్తుచేశారు. సంఘం ప్రతినిధుల మధ్య తలెత్తిన విబేధాలు వీడి, యూనిట్ ఏర్పాటుకు ఐక్యంగా ముందుకు రావడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు బాలరాజు, నాదం, రవి, పెద్దపల్లి శ్రీను, రాజు, రాము, బీఆర్ఎస్ నాయకులు రాజుగౌడ్, ప్రభుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక రంగానికి ఊతమిస్తున్న భారత్ గౌరవ్ రైళ్లు

హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): 'భారత్ గౌరవ్ రైళ్లు భారతీయ సాంస్కృతిక, చారిత్రాత్మక కేంద్రాలను సందర్శించేందుకు పర్యాటకులకు సేవలందిస్తున్నాయి. గతేడాది 24 రాష్ట్రాల్లో భారత్ గౌరవ్ రైళ్లు 172 ట్రిప్పులతో 96,491 మంది పర్యాటకులను కోరుకున్న ప్రదేశాలకు తీసుకువెళ్లి తిరిగి గమ్యస్థానాలకు చేర్చినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. దేశీయ పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్', 'దేఖో అప్నాదేశ్' కార్యక్రమాలకు అనుగుణంగా రైల్వే అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీరామ్- జానకి యాత్ర, శ్రీజగన్నాథ్ యాత్ర, గర్వి గుజరాత్ పర్యటన, అంబేద్కర్ సర్క్యూట్, ఈశాన్య రాష్ట్రాల్లోని ప్రసిద్ధ కేంద్రాలను సందర్శించేందుకు భారత్ గౌరవ్ యాత్ర రైళ్లలో ప్రత్యేక ప్యాకేజీలను అందిస్తున్నారు. విజ్ఞాన, వినోద యాత్రల ప్యాకేజీలో భాగంగా అవసరమైన ప్రాంతాలకు బస్సుల్లో తీసుకువెళ్లడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. విహారయాత్రలు, హోటళ్లలో వసతి సౌకర్యం, టూర్ గైడ్‌లు, భోజనం తదితర సౌకర్యాలను సమకూరుస్తున్నారు. భారత్ గౌరవ్ రైలు పథకంలో భాగంగా ప్రత్యేకంగా రూపొందించిన కోచ్‌లను రైల్వే అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. మరిన్ని వివరాలకు పర్యాటకులు https://www.irctctourism.com/bharatgaurav వెబ్‌సైట్‌ను సందర్శించాలని రైల్వే అధికారులు సూచించారు.

'మాక్సివిజన్' ఆస్పత్రిలో ఆర్మీ సిబ్బందికి ఉచితంగా పరీక్షలు

హైదరాబాద్ సిటీ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : మాక్సివిజన్ సూపర్ స్పెషాల్టీ కంటి ఆస్పత్రిలో గురువారం నుంచి ఈనెల 31 వరకు ఆర్మీ సిబ్బందికి ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి. సోమాజిగూడ, అత్తాపూర్, బేగంపేట, మాదాపూర్, కూకట్‌పల్లి, మదీనాగూడ, ఏఎస్‌రావునగర్, దిల్‌సుఖ్‌నగర్, సంతోష్‌నగర్, కొత్తపేట, తార్నాక, వరంగల్, మణికొండ ప్రాంతాల్లోని తమ ఆస్పత్రుల్లో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తారని, ఆంధ్రప్రదేశ్‌లోని తమ ఆస్పత్రుల్లో కూడా పరీక్షలు నిర్వహిస్తారని ప్రకటనలో పేర్కొన్నాయి.


సందర్శకులతో కిటకిటలాడుతున్న జూపార్కు

జూపార్కులో సందర్శకుల సందడి

మదీన, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ నేపథ్యంలో మంగళవారం పాతబస్తీలోని పలు పర్యాటక స్థలాలు సందర్శకులతో కళకళలాడాయి. నగరం నుంచే కాకుండా చుట్టుపక్కల జిల్లాల నుంచి కూడా సందర్శకులు వచ్చారు. సుమారు 23 వేల మంది జూను తిలకించారు. జూపార్కు సమీపంలోని సుధాకార్స్ మ్యూజియానికి కూడా పెద్దసంఖ్యలో జనం తరలివచ్చారు.

జైపాల్‌రెడ్డి కృషి వల్లే మెట్రో మంజూరైంది

మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

హైదరాబాద్ సిటీ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): నగరానికి మెట్రో రైలు ప్రాజెక్టు మంజూరు చేయించేందుకు మాజీ కేంద్ర మంత్రి, దివంగత నేత జైపాల్‌రెడ్డి ఎంతో కృషి చేశారని మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి అన్నారు. జైపాల్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని మంగళవారం నెక్లెస్‌రోడ్డులోని స్ఫూర్తిస్థల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎన్వీఎస్ రెడ్డి మాట్లాడుతూ మెట్రో ప్రాజెక్టుకు అప్పటి కేంద్ర మంత్రిగా వయెబులిటీ గ్యాప్ ఫండింగ్‌కు కృషిచేశారని గుర్తుచేశారు. మెట్రో ప్రాజెక్టులకు స్టాండర్డ్ గేజ్ అవసరమని తాను ఇచ్చిన ప్రజెంటేషన్‌కు మార్గనిర్దేశనం చేశారని పేర్కొన్నారు. జైపాల్‌రెడ్డి పట్టుదల కారణంగానే నగరానికి మెట్రో ప్రాజెక్టు మంజూరైందని చెప్పారు.

పొంచి ఉన్న ప్రమాదం

● జనావాసాల మధ్య పరిశ్రమలు
● పట్టించుకోని అధికారులు

సైదాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సైదాబాద్, ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలో జనావాసాల మధ్య ఉన్న అనధికార పరిశ్రమలతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అనుమతులు లేకుండా యథేచ్ఛగా గత కొద్ది సంవత్సరాలుగా పరిశ్రమలు నిర్వహిస్తున్నా జీహెచ్ఎంసీ, కాలుష్య నియంత్రణ అధికారులు ప్రేక్షకపాత్ర వహించడం పట్ల పలు అనుమానాలు తల్లెత్తుతున్నాయి. ముఖ్యంగా ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించకుండా పరిశ్రమలు నిర్వహిస్తుండటంతో ఎప్పుడు ఎక్కడ ఏ ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. గతంలో బాలాజీనగర్‌లోని ఎస్ఎస్ ఫైబర్‌టెక్ షీట్ ఫ్యాక్టరీ, ఆదర్శనగర్‌లో ప్లైఉడ్ గోదాంలో చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంలో సకాలంలో అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేయడంతో పెను ప్రమాదం తప్పింది. సైదాబాద్, ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలో సుమారు 30పరిశ్రమలు కొనసాగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. కనీసం పరిశ్రమల బోర్డు సైతం ఏర్పాటు చేయకుండా నిర్వహిస్తుండటం పలు అనుమానాలకు తావిస్తుంది. అంతేగాకుండా అనుమతి లేకుండా నిర్వహిస్తున్న గోదాంలు, ఫ్యాక్టరీలపై స్థానిక కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు స్వయంగా అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందన కొరవడటంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సదరు పరిశ్రమ యాజమానులకు ఉన్నతాధికారుల, రాజకీయ నేతల అండ ఉండటంతోనే చర్యలు తీసుకోవడానికి జంకుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గత కొన్నేళ్లుగా నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న పరిశ్రమలపై చర్యలు తీసుకోవడంలో సంబంధిత అధికారులు విఫలమయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వాస్తవానికి కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ), ఫైర్, కార్మిక, రెవెన్యూ, జీహెచ్ఎంసీ విభాగం అధికారుల అనుమతి తీసుకుని పరిశ్రమలు నిర్వహించాలి. కానీ ఎలాంటి అనుమతులు లేకుండా జనావాసాల మధ్య పరిశ్రమలు యథేచ్ఛగా నిర్వహిస్తున్నా అడిగే నాథుడే కరువయ్యారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. ఇందంతా ఉన్నతాధికారులు, రాజకీయ నేతల కన్నుసన్నల్లో జరుగుతుందని, పరిశ్రమల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పరిశ్రమల నిర్వహణపై వారి యాజమాన్యాలను కొందరు స్థానికులు అడిగితే బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలుస్తుంది. కొంత మంది ధైర్యం చేసి అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేడు.

నగర శివార్లకు తరలించాలి



ఇక్కడి పరిశ్రమలను వెంటనే నగర శివారు దూర ప్రాంతాలకు తరలించాలి, అనుమతులు లేని, నిబంధనలు ఉల్లఘించి నిర్వహిస్తున్న పరిశ్రమల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలి. డివిజన్‌లో అనుమతులు లేకుండా కొనసాగుతున్న పరిశ్రమలపై గ్రేటర్ కమిషనర్‌ను కలిసి విన్నవిస్తా

- జంగం శ్వేతామధుకర్ రెడ్డి, కార్పొరేటర్, ఐఎస్‌సదన్ డివిజన్


అగ్నిప్రమాదం చోటుచేసుకున్న ఎస్ఎస్ ఫైబర్‌టెక్ షీట్ ఫ్యాక్టరీ (ఫైల్)

కన్నెత్తి చూడని అధికారులు...

ఇక్కడి పరిశ్రమల నిర్వహణ చూస్తే పూర్తిగా నిబంధనలకు తిలోదకాలిచ్చినట్లు కొట్టొచ్చినట్లు కనబడుతోంది. ఒక్కటంటే ఒక్క నిబంధన కాదు కదా.. కనీస భద్రతా ప్రమాణాలు పాటించకుండా నిరభ్యంతర పత్రం పొందకుండా పరిశ్రమలు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇక్కడ ఉన్నా కొన్ని పరిశ్రమలకు పీసీబీ, అగ్నిమాపక శాఖ అనుమతి పత్రం, కార్మిక, జీహెచ్ఎంసీ, రెవెన్యూ, ఎస్‌టీఓ అనుమతులు లేవనీ, అధికారులు కన్నెత్తి చూడటం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి పరిశ్రమలను నగర శివారు ప్రాంతాలకు తరలించాలని వారు కోరుతున్నారు.